క్లుప్తంగా

కాంగ్రెస్‌పై ప్రజల్లో నమ్మకం పోయింది



మాట్లాడుతున్న సురేశ్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: మహారాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని, ప్రజలు కాంగ్రెస్ పార్టీని విశ్వసించడం లేదని ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉప ఎన్నికల్లోనూ బీజేపీ–ఎన్డీఏ కూటమి విజయం సాధించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేలా వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఏడాది కాకముందే రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి మొదలైందన్నారు. నాయకులు వేల్పుల రాజన్న, దేవిడి రజనీకర్‌రెడ్డి ఉన్నారు.

ఆలయంలో చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన గురుస్వామి శ్రీఅద్దెంకి సారంగాచారి ఆధ్వర్యంలో ఆలయ త్రయోవింశతి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం అమ్మవారి, నాగరాజు స్వామి మూల విరాట్‌లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం మహా అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, శంకర్‌నాయక్, కండెం సురేశ్, స్టాలిన్‌గౌడ్, చక్రపాణి, వీరారెడ్డి, సుధాకర్‌రావు, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు లక్ష్యాలు అధిగమించాలి



సభ్యత్వ నమోదు చేయిస్తున్న లావణ్య

పెద్దపల్లిరూరల్: బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాలను అధిగమించాలని పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి సోమారపు లావణ్య అన్నారు. పెద్దపల్లి మండలం పెద్దకల్వలలో ఆదివారం ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టే కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరిస్తూ సభ్యత్వ నమోదు చేయించాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్, సభ్యత్వ ప్రముఖ్ పోల్సాని సంపత్‌రావు, రామన్న, తిరుపతి ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

జ్యోతినగర్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన అంజన్‌కుమార్‌ను జిల్లా శ్రీనిధి టీచర్స్ ఎంప్లాయీస్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులు సన్మానించారు. ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్‌లో జరిగిన శ్రీనిధి పెద్దపెల్లి డిస్ట్రిక్ట్ టీచర్స్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఆరో వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆదివారం టీచర్‌ను సన్మానించి జ్ఞాపిక అందించారు. కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

పట్టభద్రుల సమస్యలు పరిష్కరిస్తా

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పాత్రికేయ రంగాల్లోని పట్టభద్రులు, నిరుద్యోగ యువత సమస్యలు పరిష్కరిస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు సుల్తానాబాద్ నుంచి పెద్దపల్లి వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న వారికోసం అవసరమైన మెటీరియల్ సిద్ధం చేసి 10 వేల పుస్తకాలను గ్రంథాలయాలకు అందించానని తెలిపారు. పట్టభద్రులు తనకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు అల్లెంకి శ్రీనివాస్, కనకయ్య, తిరుపతి, రవీందర్ ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ మోసాలపై ఎస్‌బీఐ, ఆర్‌బీవో అధికారుల అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీఐ బ్యాంక్ అధికారులు

కోల్‌సిటీ: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రజలు అప్రమతంగా ఉండాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) గోదావరిఖని బ్రాంచ్‌కు చెందిన రీజినల్ బిజినెస్ ఆఫీస్ (ఆర్‌బీవో) అధికారులు సూచించారు. గోదావరిఖని శారదానగర్‌లోని పీజీ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన సైబర్ మోసాలపై వాకర్స్‌కు ఆదివారం బ్యాంక్ అధికారులు వెంకటేశ్వర్లు, సతీశ్, నరేశ్ అవగాహన కల్పించారు. యూపీఐ, డెబిట్, క్రెడిట్ లావాదేవీలు, ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్‌తోపాటు ట్రాయ్, డిజిటల్ అరెస్ట్, స్టాక్ ట్రేడింగ్, ఈజీ మనీ, కేవైసీ తదితర సైబర్ మోసాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విదేశీ, అంతర్జాతీయ లావాదేవీలకు పరిమితి సెట్ చేసుకోవాలని సూచించారు. తెలియని వ్యక్తులు సూచించిన యాప్‌లను డౌన్లోడ్ చేసుకోవద్దన్నారు. ఏదైనా సైబర్ ఫ్రాడ్ జరిగితే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం సైబర్ మోసాలపై అవగాహన కల్పించే కరపత్రాలను వాకర్స్‌కు పంపిణీ చేశారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్–2024, సీనియర్ సినీ హీరో రెబల్ స్టార్ కృష్ణంరాజు మెమోరియల్ కప్ పోటీల్లో గోదావరిఖనికి చెందిన రెడ్ డ్రాగన్ కరాటే ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆరు గోల్డ్ మెడల్స్, మూడు సిల్వర్ మెడల్స్, 2 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. మెడల్స్ సాధించిన వారిలో డి.జేమ్స్, పీ.శ్రీరిషి, ఏ.సికార్, ఎస్.ఆశ్రిత్, బి.శ్రీసాయి, ఆర్.అహాన్, ఏ.ఆదిత్య, ఎస్కే అబ్బాస్ ఉన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రెడ్ డ్రాగెన్ కరాటే ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకుడు, డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ షిహాన్ కరాటే మొండయ్య, కోచ్‌లు కె.క్రాంతికుమార్, ఎం.అముర్త సాయి, అభినందించారు.

ఐఎన్‌టీయూసీ నాయకుడికి సన్మానం



సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రామగిరి: ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమితులైన మడ్డి రాజ్‌కుమార్ గౌడ్‌ను ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. సెంటినరికాలనీ శ్రీపాదభవన్‌లో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, నాయకులు ఆరెల్లి కొమురయ్య, కొరుకొప్పుల తులసీరాం గౌడ్, మైదం వరప్రసాద్, కొప్పుల గణపతి, గాజుల శ్రీనివాస్, పీ.వీ.గౌడ్, గాజుల భూమయ్య, అవినాష్, బంక్ మల్లేశ్ పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న మిత్రులు

ధర్మారం: మండలంలోని కటికెనపల్లి గ్రామ బస్టాండ్ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన పెసరి స్వామి మృతి చెందాడు. స్వామి కుటుంబానికి ఆదివారం అతనితో చదివిన పదో తరగతి బ్యాచ్ మిత్రులు రూ.68వేల నగదు అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన పెసరి స్వామి టిఫిన్ సెంటర్ నడుపుతూ జీవనం సాగించేవారు. ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. విషయం తెలుసుకున్న 30ఏళ్ల క్రితం తనతో చదువుకున్న పదో తరగతి మిత్రులు చందాలు వేసుకుని కుటుంబానికి నగదు అందించారు. జూలపల్లి మండలం కోనరావుపేటకు చెందిన ఇప్పనపెల్లి గణేశ్ ప్రత్యేక చొరవ తీసుకుని తన పరిచయస్తుల ద్వారా చందాలు జమ చేసి ఇచ్చినట్లు మిత్రులు తెలిపారు.

మానేరుపై వంతెన నిర్మించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఓదెల: మండలంలోని కనగర్తి గ్రామ పరిధిలోని మానేరుపై వంతెన నిర్మించాలని కేంద్రహోంశాఖ సహాయమంత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు మడక మాజీ ఎంపీటీసీ ఆవుల ముక్తేశ్వర్ ఆదివారం కరీంనగర్‌లో వినతిపత్రం అందజేశారు. వీణవంక మండలం మల్లారెడ్డిపల్లె, కనగర్తి గ్రామాల మధ్యలో మానేరుపై వంతెన నిర్మిస్తే కరీంనగర్ జిల్లా జమ్మికుంట, హుజూరాబాద్, వీణవంక, శంకరపట్నం మండలాలతో పాటు పెద్దపల్లికి రవాణా మరింత మెరుగుపడుతుందని వివరించారు. వంతెన నిర్మాణానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మాజీ ఎంపీటీసీ పేర్కొన్నారు. నాయకులు తీర్థాల కుమార్, సంది శంకర్‌రెడ్డి, ఎంబాడి మల్లేశ్, మందాటి రఘురాంరెడ్డి, ఆగారెడ్డి పాల్గొన్నారు.

యువత బాధ్యతగా మొక్కలు నాటాలి

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో స్వామి వివేకానంద వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏక్, పెడ్, మా, కె నామ్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని రోడ్డుకిరువైపులా మొక్కలు నాటారు. వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సందనవేణి ఓమేశ్ మాట్లాడుతూ యువత బాధ్యతగా తీసుకుని మొక్కలు నాటాలని కోరారు. వెంకటేశ్, సాయిరాం, ఆదిత్య, సాగర్, రాహుల్, తరుణ్, రిషి పాల్గొన్నారు.

జీడీకే–11 గని పిట్ సెక్రటరీగా నాయిని శంకర్

గోదావరిఖని: ఆర్జీ–1 ఏఐటీయూసీ పిట్ సెక్రటరీగా నాయిని శంకర్ ఎంపికయ్యారు. స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో మైన్ కమిటీని ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ప్రకటించారు. మైన్ ఏఐటీయూసీ ఇన్‌చార్జిగా సిద్దమల్ల రాజు, పిట్ సహాయ కార్యదర్శిగా గొడిశల నరేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, రంగు శ్రీనివాస్, వెంకటరెడ్డి, సోహెల్, రవి పాల్గొన్నారు. అలాగే జీడీకే –2ఏ గని ఏఐటీయూసీ పిట్ సెక్రటరీగా కారంపూడి వెంకన్న, సహాయ కార్యదర్శి షేక్ అజీంపాషాను ఎన్నుకున్నారు.

సర్వే ఆన్‌లైన్ ప్రారంభం



ఆన్‌లైన్ చేస్తున్న ఆపరేటర్లు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే దరఖాస్తుల ఆన్‌లైన్‌ను కంప్యూటర్ ఆపరేటర్లు ప్రారంభించారు. మండల పరిషత్‌కు వచ్చిన దరఖాస్తుల న్నీ ఆన్‌లైన్ చేస్తారని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు ఆదివారం తెలిపారు. ఎంపీవో సమ్మిరెడ్డి, కార్యాలయం సూపరింటెండెంట్ ఫక్రుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ సాదిక్ పాషా, జూనియర్ అసిస్టెంట్ అజీమ్, వేణు, అలీ, కార్యదర్శులు ఉన్నారు.

అంతర్గాంలో..

రామగుండం: కులగణన సర్వే వివరాలను ఆదివారం నుంచి అంతర్గాం మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్నారు. అంతర్గాం మండల పరిధిలో 95శాతం సమాచారం సేకరించినట్లు ఎంపీడీవో ఎంఏ.అలీం తెలిపారు.

ఆలయానికి రూ.2లక్షల విరాళం ప్రకటన



విరాళం ప్రకటిస్తున్న దంపతులు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ నిర్మాణానికి మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన జంగ నర్మద–ప్రభాకర్‌రెడ్డి దంపతులు ఆదివారం రూ.రెండు లక్షల 16వేల విరాళం ప్రకటించారు. అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దాతలకు రశీదు ఇచ్చారు.

సంక్షిప్త వార్తలు

● భక్తులకు అన్నదానం

సుల్తానాబాద్: స్థానిక గుడి మిట్టపల్లె శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులకు అన్నదానం చేశారు. పూజారి పోలాస అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో అంతకుముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్యాపారులు ఆకుల రాములు, రౌతు సురేశ్, తోడేటి రాములు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత తదితరులు పాల్గొన్నారు.

● నేడు రైతు సమస్యలపై సభ

గోదావరిఖనిటౌన్: రాష్ట్ర రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో రైతు సమస్యలపై సోమవారం సాయంత్రం 4గంటలకు స్థానిక గణేశ్‌నగర్‌లోని స్నేహ సాహితీ గ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఏలేశ్వరం వెంకటేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ చంద్రకుమార్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కావున రైతులు, రైతు శ్రేయస్సు కోరే మిత్రులు అందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

● సిమెంట్ బెంచీలు ఏర్పాటు

రామగిరి: మండలంలోని పన్నూర్ గ్రామానికి చెందిన కుంట రాంచంద్రం స్మారకార్థం ఆయన కుమారుడు కుంట కుమార్‌స్వామి పన్నూర్‌లో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలను పన్నూర్ మాజీ ఎంపీటీసీ చిందం మహేశ్, లొంకకేసారం మాజీ సర్పంచ్ ఎండీ.మంజూర్ ప్రారంభించారు. పన్నూర్ చౌరస్తాలో రెండు బెంచీలు, మార్కెట్ చౌరస్తాలో రెండు బెంచీలు, పన్నూర్ పంచాయతీలో రెండు బెంచీలు ఏర్పాటు చేశారు. గ్రామస్తులు కుమార్‌స్వామిని అభినందించారు. కార్యక్రమంలో కల్వచర్ల మాజీ సర్పంచ్ దేవ రామస్వామి, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

● కంటి వైద్యశిబిరానికి స్పందన

ఓదెల: ఓదెల గ్రామంలో మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ విజన్‌కేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు పూదరి దత్తాగౌడ్ సహకారంతో నిర్వహించిన ఉచితకంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఓదెలలో ఆదివారం ప్రయివేట్ పాఠశాలలో నిర్వహించిన ఉచితకంటి వైద్య శిబిరంలో 250మందికి పరీక్షలు చేశారు. 52మందికి కంటిలో పొరలున్నాయని వారికి చల్మెడ ఆనందరావు హాస్పిటల్‌లో ఆపరేషన్లు జరుగుతాయని పేర్కొన్నారు. నేత్ర వైద్య సహాయకులు లగిశెట్టి వంశీ, డాక్టర్ సర్వర్ పాల్గొన్నారు.

● వనభోజనాలు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామంలోని ఆదర్శనగర్‌లో ఆదివారం కమ్మ కుల సంఘ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఆయా ప్రాంతాలకు చెందిన కమ్మ కులస్తులు కుటుంబ సభ్యులతో సమావేశానికి హాజరై వన భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం పలు సంస్కృతిక కార్యక్రమాలు

● మేదరి సంఘం అధ్యక్షుడిగా రెడ్డి భాస్కర్

గోదావరిఖనిటౌన్: స్థానిక మేదరిబస్తీలోని మేదరి సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా రెడ్డి భాస్కర్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా గైని రాయనర్సు, కోశాధికారిగా బొమ్మిడి రాజనర్సు, ఉపాధ్యక్షుడిగా పందిళ్ల సంతోష్ ఎన్నికైనట్లు ఎన్నికల కన్వీనర్‌గా వ్యవహరించిన పండిల్ల రామయ్య ప్రకటించారు.

● నిరాధార ఆరోపణలు సరికాదు

మంథని: బీజేపీ నాయకుడు చల్లా నారాయణరెడ్డి నిరాధారమైన ఆరోపణలు సరికాదని బీసీ సెల్ డివిజన్ అధ్యక్షుడు గోటికార్ కిషన్ అన్నారు. మచ్చలేని మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబుపై ఆరోపణలు సహించరానివన్నారు.

● సెపక్‌తక్రా కార్యవర్గం నియామకం

రామగిరి: సెపక్‌తక్రా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలోని ఫతేమైదాన్ క్లబ్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగెపల్లి గ్రామానికి చెందిన పూదరి సత్యనారాయణగౌడ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం సీఈవో ప్రేమ్‌రాజ్ సత్యనారాయణను సన్మానించారు.

● ఉద్యమకారుల ఫోరం జిల్లా సంయుక్త కార్యదర్శిగా రవీందర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామానికి చెందిన కల్వల రవీందర్‌ను ఉద్యమకారుల ఫోరం జిల్లా సంయుక్త కార్యదర్శిగా నియమించినట్లు జిల్లా ఫోరం అధ్యక్షుడు గుండేటి ఐలయ్య తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారికి రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు.

● ఆలయానికి నాగసాధువు..

రామగుండం: జమ్మూకశ్మీర్ నుంచి వచ్చిన ఓ నాగ సాధువు ఆదివారం పట్టణంలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉన్న అయ్యప్ప గురుస్వామి గోపగాని రాములుగౌడ్ దంపతులు సాధువుకు ఘన స్వాగతం పలికారు.

క్వాలిటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

గోదావరిఖని: స్ట్రక్చర్ సమావేశంలో క్వాలిటీ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌ను ఉద్యోగులు కోరారు. భాస్కర్‌రావుభవన్‌లో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. శాంప్లింగ్ మజ్దూర్‌లకు సంబంధించి క్యాడర్ స్కీంలో పొందుపర్చిన డిజిగ్నేషన్ మార్పు చేయాలని కోరారు. క్వాలిటీ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు.



రామగుండం: పట్టణంలోని 21వ డివిజన్ పరిధిలో ఉన్న కేంద్ర ప్రాథమిక పాఠశాల, లైబ్రరీల ప్రాంగణంలో మూడు వృక్షాలు ఎండిపోయి కూలే పరిస్థితిలో ఉన్నాయి. అదే ప్రాంగణంలో నిత్యం పాఠశాల విద్యార్థులు, లైబ్రరీకి వచ్చే పాఠకులు వెళ్లే రహదారిలో ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి వృక్షాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



క్షీరాభిషేకం చేస్తున్న మేయర్, నాయకులు

గోదావరిఖని: నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ముందుకు సాగుతున్నారని నగర మేయర్ బంగి అనిల్ కుమార్ అన్నారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేశ్, ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామితో కలిసి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. దీనికి ముందు పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ రామగుండం ప్రాంతాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు కాల్వ లింగస్వామి, తిప్పారపు శ్రీనివాస్, దీటి బాలరాజు, ఎండీ ముస్తాఫా, దొంత శ్రీనివాస్, పొన్నం లక్ష్మణ్‌గౌడ్, బాల రాజ్‌కుమార్, అడ్డాల రామస్వామి, పాతిపెల్లి ఎల్లయ్య, కాంగ్రెస్ దాని అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

యైటింక్లయిన్‌కాలనీ: సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆదివారం కాలనీ కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చేందుకు కృషిచేసిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మంత్రి శ్రీధర్ బాబు, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి మిఠాయిలు పంచారు. కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, కార్పొరేటర్ శంకర్‌నాయక్, జక్కుల దామోదర్‌రావు, చక్రపాణి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు ఈనెల 28న జరిగే స్ట్రక్చర్ సమావేశంలో ప్రస్తావించాలని నాయకులు కోరారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. స్కిల్డ్, అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, హైస్కిల్డ్ కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లించడం మూలంగా నష్టపోతున్నారన్నారు. నాగాల పేరుతో కార్మికుల నుంచి పెనాల్టీ వసూలు చేసే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు గౌస్, నాయకులు మద్దెల దినేశ్, శ్రీనివాసరావు, వై.లెనిన్, రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఉద్యమించాలి

రామగుండం: రైతు వ్యతిరేక చట్టాలు, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్మడి వెంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం అంతర్గాం మండల పరిధిలోని ఎగ్లాస్‌పూర్‌లో నిరసన దీక్షలు ప్రదర్శించారు. ఈనెల 26న దేశవ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు. తీగుట్ల రాములు, ఆడెపు నర్సయ్య, బర్పటి మల్లయ్య, తీగుట్ల నవీన్, మల్లేశ్, చిలుక రాయలింగు, భూమయ్య, కుమార్, దయాకర్ ఉన్నారు.

మాలల సింహగర్జన విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

పాలకుర్తి: హైదరాబాద్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహగర్జన మహాసభను రాష్ట్రంలోని మాలలు విజయవంతం చేయాలని పాలకుర్తి మండల ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు వేల్పుల రాజ్‌కుమార్ కోరారు. బసంత్‌నగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హలో మాల, చలో హైదరాబాద్ సింహగర్జన సభకు మండల పరిధిలోని మాల కులబాంధవులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు మేరుగు కుమార్, నూకల దయాకర్, కోల ప్రసాద్, తీగుట్ల కృష్ణ, సంకెన్ల రాజ్‌కుమార్, దేవి ఆంజనేయులు, రావుల సందీప్, గజ్జెల్లి సతీశ్, కాసర్ల కిరణ్, నంది శ్యామ్ పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

గోదావరిఖనిటౌన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవుదినాల్లో పాఠశాలలు నడుపుతున్న స్థానికంగా ఉన్న పలు ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని బీఆర్‌ఎస్వీ విద్యార్థి విభాగం నాయకులు చింటు, శ్రావణ్ డిమాండ్ చేశారు. స్థానిక మార్కండేయకాలనీ, సంజయ్‌గాంధీనగర్‌లోని పాఠశాలలకు వెళ్లి అధ్యాపకులతో, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రత్యేక తరగతుల పేరిట సెలవు రోజుల్లో కూడా విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు విద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంపై వారు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సదరు కార్పొరేట్ పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మందుబాబులకు ట్రాఫిక్ 'శిక్ష'ణ

పెద్దపల్లిరూరల్: అతిగా మద్యం సేవించి వాహనం నడిపిన మందుబాబులకు శుక్రవారం పెద్దపల్లి న్యాయమూర్తి మంజుల రూ.వెయ్యి జరిమానాతోపాటు రెండు రోజుల పాటు ట్రాఫిక్ విధులు నిర్వహించాలని తీర్పునిచ్చారు. కాగా పట్టణంలోని కమాన్ చౌరస్తా వద్ద ఆదివారం వీరితో ట్రాఫిక్ విధులు నిర్వహించారు.